


# నిజం
దృష్టి తెలుగు న్యూస్

TG/TEL/25/A3731



WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-282 | పేజీలు:-4 | ఆదివారం 28-09-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:282 | pages:04 | Sunday - 28-09-2026


## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

కోరలు చాస్తున్న పేదరికం

- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు




దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో - మిగతా 2 లో

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం

హర్మూజ్, సూయజ్ వ్యాపారానికి పెను ముప్పు!

- హర్మూజ్ ద్వారా చమురు రవాణా రెండొంతులకు పునరుద్ధరణ
- రవాణా పూర్తిగా నిలిచిపోయిందనే వాదనలను కొట్టిపారేసిన అమెరికా
- జోర్డాన్‌లోని అమెరికా బేస్‌పై ఇరాన్ దాడి, ఇద్దరు యూఎస్ సైనికుల మృతి
- సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నం?
- యుద్ధం కారణంగా విపరీతంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు



పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి చమురు రవాణా మార్గాలను ప్రమాదంలోకి - మిగతా 2 లో

## తెలంగాణకు కొత్త మెట్రో

ప్రాజెక్టులకు అనుమతులపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం
- హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు రూ.1,204 కోట్లు ఇచ్చామని వెల్లడి
- ఏపీలో ఎలాంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని స్పష్టీకరణ

తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. - మిగతా 2 లో

## తిరుమలకు భారీగా భక్తుల రాక

31 కంపార్ట్‌మెంట్లు ఫుల్



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి
- శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం
- ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 90,956 మంది భక్తులు

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని - మిగతా 2 లో

## 'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'

# రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్

- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శలు
- కాంగ్రెస్ లక్ష్యం గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తేవడమేనని ఆరోపణ
- రేవంత్ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పంచుకున్న భండారీ
- ఎమర్జెన్సీ, 1984 అల్లర్ల వంటి అంశాల ప్రస్తావన
- నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకుంటూ రేవంత్ వ్యాఖ్యలు



2లో

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు ఈ రెండు పరివార్ల మధ్యేనని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందించారు.

## స్కైరూట్ విజయం వేళ రాహుల్ వయసుపై

# ప్రధాని మోదీ చురకలు

- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని



2లో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి

నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి



- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. - మిగతా 2 లో

## విద్యార్థులపై లాఠీచార్జ్ స్పందించిన రాహుల్ గాంధీ



- పరీక్షల్లో అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థుల భారీ నిరసన
- పార్లమెంట్ వైపు వెళుతున్న ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్
- విద్యార్థులపై దాడి అప్రజాస్వామికమని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నిరసనకారుల డిమాండ్

పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముట్టడికి యత్నించిన - మిగతా 2 లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు -- మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జటిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, - మిగతా 2 లో

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

# ప్రైవేటీకరణ చేస్తున్నారా?

సీఎం చంద్రబాబు సమాధానం ఇదే!

- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

2లో




రాష్ట్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన,

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా



- చదువుతో పేదరికాన్ని జయించవచ్చన్న మంత్రి నారాయణ
- పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో పైకొచ్చానని వెల్లడి
- నెల్లూరులో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపు

చదువుతో పేదరికాన్ని జయించవచ్చని, కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఏపీ - మిగతా 2 లో

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా

మొదటిపేజీ తరువాయి – పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో జరిగిన 'షైనింగ్ స్టార్ అవార్డ్స్ - 2026' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ తన జీవితంలోని ఆసక్తికర విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. తాను పదో తరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయినట్లు వెల్లడించారు. ఆ వైఫల్యమే తనలో పట్టుదలను పెంచిందని, మూడేళ్ల డిగ్రీలో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని గుర్తుచేసుకున్నారు. కష్టపడి చదివితేనే లక్ష్యాలను చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. చదువు పూర్తయ్యాక వీఆర్సీలో రూ.40 జీతానికి పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేశానని, ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం వచ్చినా రాజీనామా చేసి, ట్యూషన్లు చెబుతూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. యువనేత నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మంత్రి కొనియాడారు. ఈ మార్పులను, అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణకు కొత్త మెట్రో

మొదటిపేజీ తరువాయి – సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్-2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు మెట్రో విస్తరణ అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనతో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని స్పష్టమవుతోంది.c

## తిరుమలకు భారీగా భక్తుల రాక

మొదటిపేజీ తరువాయి – రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్... స్పందించిన రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి – విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమని, భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరుణంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీ వేదికగా నిరసన చేపట్టారు. నీట్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, ఇతర అక్రమాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటతో ఉద్రిక్తత నెలకొనగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. "ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతున్న వారు నేరస్థులు కాదు, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు. వారిపై బలప్రయోగం చేయడం తగదు" అని ఆయన హితవు పలికారు. దేశంలో 152 పేపర్ లీకేజీల వల్ల సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నా, ప్రభుత్వం మాత్రం బాధ్యులను కాపాడటానికే ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.ద

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి



మొదటిపేజీ తరువాయి – ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా-బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి – విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా.

**వివిధ కేటగిరీల కింద పట్టాల పంపిణీ:**

సెక్షన్ 22ఏ సమస్యకు పరిష్కారం: మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు సెక్షన్ 22ఏ(1)(ఖ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు.

**స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు:** అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు.

**+.వా.వీం.చీశీ.30 కింద క్రమబద్ధీకరణ:** 150 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 906 పట్టాలను సిద్ధం చేశారు. వీటిలో తాడేపల్లి మండలానికి 630, మంగళగిరి మండలానికి 276 పట్టాలు ఉన్నాయి. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతాభావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటీకరణ చేస్తున్నారా?

మొదటిపేజీ తరువాయి – సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' (=ాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వివిధ అంశాలపై సీఎం కీలక ఆదేశాలు**

సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం-2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపాలి. ప్రజాప్రయోజనం ఉన్న పిటిషన్లను తప్పక పరిశీలించాలి, కానీ దురుద్దేశంతో వేసే వాటిని గుర్తించాలి" అని అన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షపాత లోటు ఉందని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అన్వేషించాలని సీఎం సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

మొదటిపేజీ తరువాయి – ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

మొదటిపేజీ తరువాయి – ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం



మొదటిపేజీ తరువాయి – నెట్టేసింది. అమెరికా వైమానిక దాడులు, ఇరాన్ ప్రతీకార దాడుల నడుమ హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా ప్రస్తుతం యుద్ధానికి ముందు నాటితో పోలిస్తే సుమారు మూడింట రెండు వంతులకు చేరుకుందని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో, ఇరాన్ ఈ ఘర్షణను మరింత విస్తృతం చేస్తూ సూయజ్ కాలువకు కూడా ముప్పు తలపెట్టే అవకాశం ఉందని నాటో మాజీ కమాండర్ హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా పూర్తిగా స్తంభించిపోయిందనే వార్తలను అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ తోసిపుచ్చారు. ప్రస్తుత సగటు ప్రకారం ఈ జలసంధి ద్వారా రోజుకు 70 మిలియన్ బారెళ్ల చమురు, బైపాస్ పైప్‌లైన్ల ద్వారా మరో 70 మిలియన్ బారెళ్ల చమురు సరఫరా అవుతోందని ఆయన వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతం నుండి మొత్తం 140 మిలియన్ బారెళ్ల సరఫరా జరుగుతోందని, ఇది గత మార్చి నెలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఓడల సంఖ్య తగ్గినప్పటికీ, ప్రపంచ మార్కెట్‌కు కొరత లేకుండా చూడటానికి పెద్ద ట్యాంకర్లను ఉపయోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. దీనికి ప్రతికారంగా అమెరికా దళాలు ఇరాన్‌పై సరికొత్త దాడులు జరిపాయి. ఇరాన్ సహకారం ఉన్నా లేకపోయినా ఈ జలసంధి ద్వారా రవాణాకు రక్షణ కల్పిస్తామని అమెరికా పేర్కొంది. అయితే డెమొక్రాటిక్ సెనేటర్ మార్క్ వార్నర్ ఈ అంచనాలను తప్పుపట్టారు. యుద్ధం కారణంగా వర్జీనియాలో పెట్రోల్ ధర గాలన్‌కు 2.81 డాలర్ల నుండి 4 డాలర్లకు, డీజిల్ ధర 5 డాలర్లకు పెరిగిందని, ఈ యుద్ధం ఒక పెద్ద విపత్తు అని ఆయన విమర్శించారు. నాటో మాజీ సుప్రీం అలైడ్ కమాండర్, రిటైర్డ్ అడ్మిరల్ జేమ్స్ స్టావ్రిడిస్ ఇరాన్ తదుపరి వ్యూహంపై సంచలన హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధి మాత్రమే కాకుండా, పశ్చిమ ప్రాంతంలో ఉన్న హౌతీ తిరుగుబాటుదారులను వాడుకుని సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని అన్నారు. ఎర్రసముద్రం ఉత్తర సరిహద్దుకు సమీపంలో ఉన్న జోర్డాన్‌పై ఇటీవల జరిగిన దాడులకు, ఈ వ్యూహానికి సంబంధం ఉండవచ్చని ఆయన విశ్లేషించారు. ఇరాన్ కనుక సూయజ్ కాలువను అడ్డుకుంటే ప్రపంచ వాణిజ్యం కోలుకోలేని దెబ్బతింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం



తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# పది ఎకరాల భూదానం... వేలాది ఆడబిడ్డల భవిష్యత్తు కు పునాది!

వసంత నాగేశ్వరరావు సేవలు నందిగామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి: ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ: నిజం న్యూస్ సెప్టెంబర్ 26:** ఒక వ్యక్తి దానం చేసిన భూమి... నేడు వేలాది మంది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఒకనాడు భవిష్యత్తు తరాల కోసం తీసుకున్న నిర్ణయం... నేడు మహిళా సాధికారతకు బలమైన పునాదిగా నిలిచింది. నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవిర్భావం వెనుక ఉన్న మాజీ హోం, నీటిపారుదల శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు నిస్వార్థ సేవ, దాతృత్వం ఇందుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వసంత నాగేశ్వరరావు చిత్రపటాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. కూటమి నాయకులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, "ఈరోజు మనం ఆవిష్కరిస్తున్నది ఒక చిత్రపటం మాత్రమే కాదు... నందిగామ ఆడబిడ్డల భవిష్యత్తుకు పునాది వేసిన మహోన్నత ఆలోచనకు గుర్తింపు" అని అన్నారు. 1988లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళా విద్యాభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో ఒక్కొక్క ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఉచితంగా స్థలం అందించే ప్రాంతాల్లో ఈ కళాశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో నందిగామలో మహిళలకు సాంకేతిక విద్య అందుబాటులోకి రావాలనే దూరదృష్టితో వసంత నాగేశ్వరరావు ముందుకు వచ్చారని తెలిపారు. దానం చేసినది భూమి కాదు... భవిష్యత్తు నందిగామ ప్రాంత ఆడబిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విలువైన 10 ఎకరాల భూమిని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కోసం ఉచితంగా దానం చేయడం ఆయన దాతృత్వా నికి నిదర్శనమని సౌమ్య పేర్కొన్నారు. ఆ భూదానం వల్లే నందిగామలో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ ద్వారా వేలాది మంది విద్యార్థినులు సాంకేతిక విద్యను అభ్యసించే అవకాశం పొందారని అన్నారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని అనేక మంది మహిళలు తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. "వసంత నాగేశ్వరరావు ఆనాడు ఇచ్చింది పది ఎకరాల భూమి కాదు... వేలాది కుటుంబాల జీవితాలకు వెలుగు. ఆయన నాటిన చిన్న విత్తనం నేడు మహావృక్షంగా ఎదిగి ఎన్నో ఆడబిడ్డలకు విద్యా నీడను అందిస్తోంది" అని ఎమ్మెల్యే అన్నారు. విద్యతో పాటు స్వయం ఉపాధికి బాట వసంత నాగేశ్వరరావు సేవలు పాలిటెక్నిక్ కళాశాలకే పరిమితం కాలేదని సౌమ్య తెలిపారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నందిగామ పరిసర ప్రాంతాలకు చెందిన పేద మహిళలు కుట్టుపని తదితర వృత్తి నైపుణ్యాలను నేర్చుకుని స్వయం ఉపాధి పొందుతున్నారని చెప్పారు. ఒక విద్యాసంస్థ... వేలాది విద్యార్థినుల జీవితాలకు మార్గదర్శకం. ఒకభూదానం... ఎన్నో కుటుంబాలకు ఆర్థిక భరోసా. ఒక దూరదృష్టి... ఒక ప్రాంత మహిళల భవిష్యత్తు ను మార్చిన చరిత్ర. ఇదే వసంత నాగేశ్వరరావు సేవలకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్ తరాల కోసం ఆస్తులను, వనరులను సమాజానికి అంకితం చేసిన వారి సేవలను నేటి తరం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విద్య ద్వారా మహిళలను సాధికారత వైపు నడిపించడమే నిజమైన అభివృద్ధికి మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి వెల్లువలో గణనాథుడికి ఘన వీడ్కోలు!

ఐక్యతకు ప్రతీకగా ముప్పాళ్ల వినాయక నిమజ్జన వేడుకలు --- ప్రజల సుఖసంతోషాల కోసం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక ప్రార్థనలు

**చందర్లపాడు: నిజం న్యూస్ సెప్టెంబర్ 26:** విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి నామస్మరణతో ముప్పాళ్ల గ్రామంమార్మోగింది. భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మికత, ప్రజల ఐక్యత మధ్య గణనాథుడి నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని భక్తులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నాయకులతో కలిసి గణనాథుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన రథానికి కొబ్బరికాయ కొట్టి గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్నిప్రారంభించారు.

### ప్రజల సుఖసంతోషాలే ఆకాంక్ష

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, గణనాథుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా, ప్రశాంతంగా జరగాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. వినాయక చవితి వేడుకలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తున్నాయనిపేర్కొన్నారు. భక్తితో పాటు సామాజిక బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

### భక్తి... ఐక్యత... ఆధ్యాత్మిక సందడి

గణనాథుడి నిమజ్జన రథం గ్రామ వీధుల్లో ముందుకు సాగుతుండగా భక్తులు గణపతి నామస్మరణలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. "గణపతి బప్పా మోరియా" నినాదాలతో ముప్పాళ్ల గ్రామంమార్మోగింది. చిన్నారులు, మహిళలు, యువత, పెద్దలు అనే తేడా లేకుండా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథు డికి భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. నిమజ్జన వేడుకల్లో కనిపించిన ప్రజల ఐక్యత, భక్తి, ఉత్సాహం గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. గణనాథుడిని నిమజ్జనం చేసినా... ఆయన ప్రసాదించే ఐక్యత, సోదరభావం, మంచి ఆలోచనలు ప్రతి ఒక్కరి జీవితాల్లో



కొనసాగాలని భక్తులు ఆకాంక్షించారు. ప్రజలందరూ పరస్పరం సహకరించుకుంటూ పండుగ లను ప్రశాంతంగా, సంతోషంగా నిర్వహించు కోవాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛ ... సుందర పట్టణమే లక్ష్యం...

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

వర్షపు నీటి నిల్వలకు శాశ్వత పరిష్కారం.







**టెక్కలి నిజం న్యూస్ సెప్టెంబర్ 26:** టెక్కలి పట్టణాన్ని స్వస్థత , సుందరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. టెక్కలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. పట్టణ పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి నిల్వలు, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అధికారులతో వివరంగా చర్చించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. పారిశుధ్య పనులు కేవలం అప్పటికప్పుడు చేపట్టే కార్యక్రమాలుగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని సూచించారు. నీరు నిలిచే 59 ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: టెక్కలి పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచే 59 ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రాంతాల్లో వర్షాకాలంలో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. గుర్తించిన ప్రాంతాలను ప్రాధాన్యతా క్రమంలో విభజించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు అవసరమైన చోట శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత హడావుడిగా చర్యలు తీసుకోవడం కాకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నీటి నిల్వల కారణంగా ప్రజలకు ఇబ్బందులు, వ్యాధుల వ్యాప్తి తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పారిశుధ్యానికి అవసరమైన సిబ్బంది నియామకం: టెక్కలి పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను సమగ్రంగా రూపొందించాలని మంత్రి సూచించారు. అవసరమైన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని ఆదేశించారు,పారిశుధ్య సిబ్బందికి అవసరమైన పనిముట్లు, వనరులు అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రతిరోజూ పారిశుధ్య పనులపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పారిశుధ్యంపై సీఎం ప్రత్యేక దృష్టి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పారిశుధ్యం, పరిశుభ్రమైన వాతావరణం, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పారిశుధ్య సమస్యలకు కేవలం ప్రభుత్వ యంత్రాంగమే పరిష్కారం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి కుటుంబంలో పరిశుభ్రతపై అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలనిఅధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్రలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం: స్వచ్ఛాంధ్ర మిషన్ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మంత్రి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం, ప్రజారోగ్య సంరక్షణ, కాలుష్య నియంత్రణ, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సక్రమంగా నిర్వహించడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడటం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కోటబొమ్మాళి వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాదిశేషగిరిరావు, డివిజనల్ అభివృద్ధి అధికారి అలివేలుమంగా, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎమ్.సుధాకర్ రావు, ఎంపీడీవో రేణుక, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావు, రహదారులు భవనాలు శాఖ, రెవెన్యూ, విద్యుత్తు శాఖ అధికారులు , పాల్గొన్నారు,

# 22 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు 8 డీటీఆర్‌లు



**జగ్గయ్యపేట: నిజం న్యూస్ సెప్టెంబర్ 26:** జగ్గయ్యపేట నియోజకవర్గం లోని చిల్లకల్లు విద్యుత్ సెక్షన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్కనెక్షన్లకు సంబంధించి 22 మంది రైతులకు 8 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) కేటాయించారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సమక్షంలో శనివారంరైతులకు డీటీఆర్‌లను అందజేశారు. చిల్లకల్లు సెక్షన్ పరిధిలో 26-09-2026 నాటికి మొత్తం 128 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. తాజాగా 8 డీటీఆర్‌ల కేటాయింపుతో 22 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరా కల్పించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ 22 కనెక్షన్లను పూర్తి చేసిన అనంతరం మరో 106 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉండనున్నాయి. ఈ సందర్భం గా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్ తో పాటు పగటిపూట 9 గంటల నాణ్యమైన 3-ఫేజ్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి రావడం ద్వారా సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులు తమ వ్యవసాయ పనులను సకాలంలో చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు, ఇతర మౌలిక వసతులను అందించేందుకు ప్రభుత్వం చర్యలుతీసుకుంటోందన్నారు.రైతులకు గిట్టుబాటు ధరలు, సాగునీటి వనరుల అభివృద్ధి, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రైతు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. చిల్లకల్లు సెక్షన్ పరిధిలో ఇంకా పెండింగ్‌లో ఉన్న 106 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు మరో 12 డీటీఆర్‌లు అవసరమవు తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ 12 డీటీఆర్ లను కేటాయించేందుకు ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అదనపు డీటీఆర్‌లు కేటాయించిన వెంటనే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దశలవారీగా పూర్తి చేసి రైతులకు విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేరం సైదేశ్వరరావు, కర్ల జోజి, వేదులపురి సైదా, ఆదిమల్ల రమేష్, చిలుకూరి కార్తీక్, జ్వాల నాయక్‌తో పాటు రైతులు, రైతు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు





**టెక్కలి, నిజం న్యూస్ సెప్టెంబర్ 26:** టెక్కలిలోని శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. చావీజ చైర్మన్ బగాది శేషగిరిరావు, తదితరులు ఉన్నారు.

# మధుర స్వరానికి మరణం లేదు.. బాలు గానం అజరామరం

తరతరాల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

ఘనంగా "మధుర స్వరాంజలి".. నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ: నిజం న్యూస్ సెప్టెంబర్ 26:** ఒక పాట వినిపిస్తే జ్ఞాపకాలు మేల్కొంటాయి.. ఒక స్వరం వినిపిస్తే మనసు పులకిస్తుంది.. ఆ స్వరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరం. శరీరంగా మన మధ్య లేకపోయినా తన గానంతో కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు.నందిగామ పట్టణం లోని పాత బస్టాండ్ బాబు జగజీవన్ రామ్ భవన్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన "మధుర స్వరాంజలి" కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. సంగీతానికి హద్దులు లేవు.. బాలు స్వరానికి మరణం లేదుఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరం భారతీయ సంగీత ప్రపంచానికి లభించిన అపూర్వమైన వరమని అన్నారు. భాష, ప్రాంతం, తరతమ భేదాలకు అతీతంగా తన మధుర గానంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న మహోన్నత కళాకారుడు బాలు అని కొనియాడారు. తెలుగు సినీ సంగీతానికే పరిమితం కాకుండా అనేక భారతీయ భాషల్లో వేలాది పాటలు ఆలపించి సంగీత ప్రపంచంపై చెరగని ముద్ర వేసిన మహనీయుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని అన్నారు. ప్రేమ, విషాదం, ఆనందం, భక్తి, భావోద్వేగం.. ఏ భావాన్నైనా తన స్వరంతో శ్రోతల హృదయాలకు చేరువ చేయగల అరుదైన ప్రతిభ బాలు సొంతమని పేర్కొన్నారు. పాట ఉన్నంత కాలం బాలు మనతోనే.. బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా అనేక తరాల జీవితాల్లో భాగమయ్యాయని ఎమ్మెల్యే సౌమ్య అన్నారు. ఆయన గాత్రం కొత్త తరాల సంగీతా భిమానులను కూడా అలరిస్తూనే ఉంటుందని, కాలం మారినా బాలు పాటల మాధుర్యం చెక్కుచెదరదని పేర్కొన్నారు. "బాలు మన మధ్య భౌతికంగా లేకపోయినా .. ఆయన స్వరం మన మధ్యే ఉంది. ఆయన పాట వినిపించిన ప్రతిసారీ ఆయన మనతోనే ఉన్న అనుభూతి కలుగుతుంది. సంగీతం ఉన్నంతకాలం.. బాలు గానం ఉన్నతంగా నిలుస్తుంది" అని ఎమ్మెల్యే సౌమ్య అన్నారు.

### 'మధుర స్వరాంజలి'తో నిండిన నందిగామ

వర్ధంతి సందర్భంగా నిర్వహించిన "మధుర స్వరాంజలి" కార్యక్రమంలో గాయకులు బాలు ఆలపించిన మధురమైన గీతాలను ఆలపించడంతో ప్రాంగణం సంగీతంతో మార్మోగింది. బాలు పాటలను ఆలపించిన సమయంలో సంగీతాభిమానులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన పాటలతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బాలసుబ్రహ్మణ్యం గానానికి నివాళిగా నిర్వహించిన ఈ కార్యక్రమం నందిగామ ప్రజల్లో ఆయన పట్ల ఉన్న అభిమానాన్ని మరోసారి చాటిచెప్పింది. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమానులు, కళాకారులు, సంగీత ప్రియులు, స్థానికులు తదితరులు పాల్గొని గానగంధర్వుడికి ఘన నివాళులు అర్పించారు.

## భూమి కోసం.. భుక్తి కోసం

# విముక్తి కోసం తిరుగుబాటు

అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ కు ఘన నివాళి



**నిజం న్యూస్ ప్రతినిధి, బోడుప్పల్, సెప్టెంబర్ 26 :** అన్యాయాన్ని ఎదిరించి.. అణచివేతపై తిరుగుబాటు చేసి.. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో అణగారిన ప్రజల పక్షాన నిలిచి, దొరల దౌర్జన్యాలను ధిక్కరించిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా హక్కుల కోసం పోరాడిన ఆమె ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నేటి సమాజంలో కూడా వెనుకబడిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ ఆశయాలను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా.. ఆమె చూపిన పోరాట బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో రజక సంఘం నేతలు ముత్యాలు ,యాదగిరి ,సిద్దులు,సత్తయ్య,వెంకటయ్య,వినోద్ ,భిక్షపతి ,అంజనేయులు,రానోజీ,విజయ్,అంజయ్య,లక్ష్మీ నారాయణ, మేడిపల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కల్మూరి ఏల్లయ్య ,వడ్డేమాను సుదర్ ,ఎన్ రాము యాదవ్ ,మరాటి మల్లేష్ ,చింత రమేష్ ,జక్కు భగిరథ్ లు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అనుసరణీయం

బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వి. రమేష్ నాయక్

ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు



**నిజం న్యూస్ ప్రతినిధి జడ్చర్ల బాలానగర్) సెప్టెంబర్ 26 :** సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని బాలానగర్ మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వి. రమేష్ నాయక్ అభిప్రాయపడ్డారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను వర్ధంతి వేడుకలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించేవారు అని గుర్తు చేశారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, తెగువ ప్రతి మహిళా మణులకు ఎంతో ఆదర్శమని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 27-09-2026

## ఐదురోజుల నష్టాలకు బ్రేక్
# లాభాల బాటపట్టిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. దాదాపు ఐదు రోజుల అనంతరం మార్కెట్లు లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో పాటు అమెరికా ద్రవ్యోల్బణం తగ్గాయన్న నివేదికలు దేశీయ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే 78,488.64 పాయింట్ల వద్ద లాభాల్లో సెన్సెక్స్ మొదలైంది. ఇంట్రాడేలో 78,189.19 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 78,918.12 పాయింట్లకు చేరింది. చివరకు 498.58 పాయింట్లు పెరిగి.. 78,540.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 165.95 పాయింట్లు పెరిగి.. 23,753.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 1,565 షేర్లు పురోగమించగా.. 2,348 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, హిందాల్కో ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్ ఉన్నాయి. ఇక హీరో మోటోకార్ప్స్, మారుతీ సుజుకీ, నెస్లే ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. సెక్టార్లలో బ్యాంక్, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ఆయిల్, గ్యాస్, ఎనర్జీ, రియల్టీ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. మీడియా ఇండెక్స్ 0.4 శాతం పతనమైంది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ స్వల్పంగా పెరగ్గా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పతనమైంది.

## ఒక్కటైన నిస్సాన్, హెూండా ప్రకటన చేసిన రెండు కంపెనీలు




జపాన్‌కు చెందిన రెండు ప్రముఖ కంపెనీలు ఇప్పుడు ఒక్కటయ్యాయి. నిస్సాన్, హెూండా కంపెనీలు జతకలిశాయి. ఈ విషయాన్ని ఆ కంపెనీలు ఇవాళ సంయుక్త ప్రకటన ద్వారా వెల్లడించాయి. ఒప్పంద పత్రాలపై సంతకాలు కూడా చేశాయి. నిస్సాన్ అలియన్స్ సభ్యుడు మిత్‌సుబిషి మోటార్స్ కూడా ఈ కలియికకు అంగీకరించింది. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆటోమేకింగ్ కంపెనీగా ఏర్పడబోతున్నట్లు ఆ రెండు కంపెనీలు సంయుక్తంగా ప్రకటించాయి. హెూండా ప్రెసిడెంట్ తోషిహిరో మైబ్ మాట్లాడుతూ.. జాయింట్ హెూల్డింగ్ కంపెనీ కింద హెూండా, నిస్సాన్ తమ ఆపరేషన్స్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. తొలుత హెూండా కంపెనీ ఈ కొత్త మేనేజ్మెంట్‌ను లీడ్ చేయనున్నది. రెండు కంపెనీలకు చెందిన సూత్రాలు, బ్రాండ్ ఇమేజ్‌లను కాపాడుకోనున్నారు. జూన్ వరకు మరోసారి అగ్రిమెంట్‌పై ప్రకటన చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 2026 నాటికి డీల్ పూర్తి అవుతుందన్నారు. జపాన్‌కు చెందిన టోయోటా కంపెనీతో పాటు జర్మనీకి చెందిన ఫోక్స్‌వాగన్ కంపెనీకి .. ఇక త్వరలో కొత్త కంపెనీ పోటీ ఇవ్వనున్నది. జపాన్ కంపెనీల్లో టోయోటా లీడింగ్‌లో ఉన్నది. మాజ్దా మోటర్ కంపెనీతో టెక్నాలజీ షేర్ చేసుకుంటోంది టొయోటా. 2023లో హెూండా 40 లక్షలు, నిస్సాన్ 34 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసింది. మిత్‌సుబిషి మోటార్స్ కేవలం పది లక్షలు మాత్రమే ఉత్పత్తి చేసింది. హెూండాతో కలిసిపోతున్నట్లు వార్తలు రాగానే.. ఒక్కసారిగా నిస్సాన్ షేర్లు దూసుకెళ్లాయి.

## ఐపీఓల బూమ్ లిస్టింగ్‌తో 90 సంస్థల రూ.1.60 లక్షల కోట్ల నిధుల సేకరణ ఇన్వెస్టర్ల నుంచి అసాధారణ రెస్పాన్స్




పరిశ్రమల నిర్వహణకు నిధులు అవసరం.. సొంత వనరులతో సంస్థ ప్రారంభించినా.. సేవల విస్తరణకు నిధుల సేకరణ తప్పనిసరి. అందుకు స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ ఒక మార్గం. ఈక్విటీ మార్కెట్లలో లిస్టింగ్ కావాలంటే ఆయా సంస్థలు ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు అనుకూల మార్కెట్ పరిస్థితులు, రెగ్యులేటరీ నిబంధనలు సానుకూలంగా ఉండాల్సి ఉంటుంది. గతంతో పోలిస్తే మార్కెట్లో సానుకూల పరిస్థితులు, రెగ్యులేటరీ నిబంధనల్లో పురోగతితో పలు సంస్థలు ఐపీఓకు వెళుతున్నాయి. ఐపీఓల ద్వారా నిధుల సేకరణలో దేశీయ కార్పొరేట్ సంస్థలు, స్టార్టప్ సంస్థలు మరో మైలురాయిని దాటాయి. స్టాక్ మార్కెట్లలో ఆయా కంపెనీల లిస్టింగ్.. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి సంకేతంగా నిలుస్తుంది. ఈ ఏడాది 90 కంపెనీలు ఐపీఓ ద్వారా రికార్డు స్థాయిలో రూ.1.6 లక్షల కోట్ల నిధులు సేకరించాయి. 2025లోనూ ఐపీఓల ద్వారా భారీగా నిధులు సమకూర్చుకునేందుకు పలు కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యంతో ఐపీఓలతో షేర్లు జారీ చేసిన సంస్థల విశ్వాసంతోపాటు లిస్టింగ్ లాభాల కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూడటం ఈ ఏడాదిలో అసాధారణమనే చెప్పాలి. దేశ చరిత్రలో అత్యధికంగా దక్షిణ కొరియా ఆటోమొబైల్ కంపెనీ హ్యుండాయ్ మోటార్ ఇండియా ఐపీఓ ద్వారా రూ.27,870 కోట్ల నిధులు సేకరించింది. ఈ ఏడాది దేశ చరిత్రలోనే అతి పెద్ద ఐపీఓగా నిలుస్తుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రీత్యా చిన్న, మధ్య, భారీ పరిశ్రమలు ఐపీఓల ద్వారా రూ.867 కోట్ల నుంచి రూ.1700 కోట్ల వరకూ నిధులు సేకరించాయి. ఇక ప్రైవేట్ టెలికం ఆపరేటర్ సంస్థ వొడాఫోన్ ఐడియా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్పీఓ) ద్వారా రూ.18 వేల కోట్ల నిధులు సేకరించింది.

**ఈ ఏడాది ప్రధాన ఐపీఓల వివరాలివే**

**హ్యుండాయ్ మోటార్స్: రూ.27,870 కోట్లు.**

**స్విగ్గీ : రూ.11,327 కోట్లు.**

**ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ : రూ.10 వేల కోట్లు.**

**బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.6,560 కోట్లు.**

**ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ: రూ.6,145 కోట్లు.**

**అతి చిన్న ఐపీఓ : విభోర్ స్టీల్ ట్యూబ్స్ %–% రూ.72 కోట్లు.**

### ఐపీఓల్లో సబ్ స్క్రిప్షన్ ఇలా

నిధుల సేకరణలో చిన్నదైనా విభోర్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓ 320 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్, మన్బా ఫైనాన్స్ అండ్ గాలా ప్రిసిషన్ ఇంజినీరింగ్ ఐపీఓలు 200పై చిలుకు రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. వన్ మొబిక్విక్ సిస్టమ్స్, యూనీ కామర్స్ ఈ-సొల్యూషన్స్, డిఫ్యూజర్ ఇంజినీర్స్, బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్, ఎగ్జిమ్ టెలీ సిస్టమ్స్ ఐపీఓల్లో 100 రెట్లు సబ్‌స్క్రిప్షన్లు నమోదయ్యాయి. 60కి పైగా కంపెనీలు స్టాక్ మార్కెట్లలో లిస్టయిన రోజే పాజిటివ్ ఫలితాలు అందుకోవడం ఓ రికార్డుగా నిలిచింది. విభోర్ స్టీ ట్యూబ్స్, బీఎల్ఎస్ ఈ సర్వీసెస్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ తదితర సంస్థలు లిస్టింగ్ రోజు 100 శాతానికి పైగా లబ్ధి పొందాయి.

### ఈ నెలలో ఐపీఓల తీరిలా

కేవలం ఈ నెలలోనే 15 సంస్థలు ఐపీఓకు వెళ్లడం ఒక అసాధారణ ప్రక్రియ కానున్నది. ఈ నెల 23,24 తేదీల్లో మరో ఎనిమిది సంస్థల ఐపీఓలు మార్కెట్లలోకి రానున్నాయి. పరిస్థితులు ఇలాగే సాగితే వచ్చే ఏడాది 75 సంస్థల యాజమాన్యాలు ఐపీఓల ద్వారా రూ.2.5 లక్షల కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వాటిల్లో హెచ్డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్లు, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ రూ.15 వేల కోట్ల విలువైన ఐపీఓలు ఉన్నాయి. 2023లో 67 కంపెనీలు ఐపీఓల ద్వారా కేవలం రూ.49,436 కోట్ల నిధులు సేకరించాయి. 2021లో కేవలం 63 కంపెనీలు రూ.1.2 లక్షల కోట్ల నిధుల సేకరణ గత రెండు దశాబ్దాల్లోనే 'బెస్ట్ ఐపీఓ ఇయర్'గా నిలుస్తుంది.

# ఆగండి.. తొందరొద్దు




## ఆరోగ్య బీమా క్లెయిముల్లో తెలివిగా వ్యవహరించండిలా

ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అందరిలోనూ అవగాహన పెరిగింది. ఎప్పుడు, ఎవరికి ఏమవుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న మనకు బీమా.. కొండంత అండగానే చెప్పాలి. అయితే ఈ బీమా క్లెయిముల్లో మాత్రం చాలామంది తొందరపాటుతో వ్యవహరిస్తున్నారు. దీంతో బీమా ప్రయోజనాలను పాలసీదారులు పెద్ద మొత్తంలో కోల్పోవాల్సి వస్తున్నది. ముఖ్యంగా ఈ శీతాకాలంలో శ్వాసకోశ, చర్మ సంబంధ సమస్యలు, ఇన్ఫెక్షన్లు సహజం. అందుకే కంగారుపడి ప్రతీ చిన్న అవసరానికీ బీమానే ప్రత్యామ్నాయంగా చూడవద్దు. క్లెయిములకు వెళ్లవద్దు. అనారోగ్యం బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోండి. సమస్య ముదిరితే వైద్యుల సలహా మేరకే పెద్ద ఖర్చులకు మాత్రమే బీమాను వినియోగిస్తే మంచిది. అసలు ఆరోగ్య బీమాలో క్లెయిములు లేకపోతే వచ్చే లాభాలెంటో తెలుసా?

### నో-క్లెయిం బోనస్

ఆరోగ్య బీమా తీసుకున్నాక తర్వాతి రెన్యువల్ వరకు ఆ బీమాను ఉపయోగించకపోతే.. అందుకుగాను బీమా సంస్థలు పాలసీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలే ఈ నో-క్లెయిం బోనస్‌లు. వీటిలో క్యుములేటివ్ బోనస్, ప్రీమియంపై డిస్కౌంట్లుంటాయి.

### క్రమేణా పైపైకి

తొలి సంవత్సరం ఎలాంటి క్లెయిములు లేకపోతే మలి సంవత్సరం పాలసీ తీసుకునేటప్పుడు అంతే మొత్తానికి బీమా కవరేజీ 10 శాతం మేర పెరుగుతుంది. ఉదాహరణకు రూ.20 వేలు చెల్లించి రూ.20 లక్షల పాలసీని తీసుకున్నారు. తొలి ఏడాది కాలంలో ఏ క్లెయిం చేయలేదు. దీంతో రెండో ఏడాదీ అదే రూ.20 వేలకు రూ.22 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇక్కడ నో-క్లెయిం బోనస్ రూ.2 లక్షలు (10 శాతం) అన్నమాట. ఇలా తర్వాతి సంవత్సరాల్లోనూ రూ.2 లక్షల చొప్పున బీమా కవరేజీ పెరుగుతూపోతుంది. వీటినే క్యుములేటివ్ బోనస్‌లు అంటారు.

### రాయితీలుజి

ప్రతి సంవత్సరం క్లెయిములు లేకపోతే ఆ పాలసీదారులకు ఇన్సూరెన్స్ సంస్థలు.. బీమా ప్రీమియంలపై రాయితీలనూ అందిస్తాయి. రెన్యువల్ సమయంలో ఈ తగ్గింపులను అందుకోవచ్చు. ఉదాహరణకు రూ.20 లక్షల ఆరోగ్య బీమాను రూ.20 వేలు పెట్టి తీసుకున్నారు. తొలి ఏడాది ఎలాంటి క్లెయిం చేయలేదు. దీంతో మీ ప్రీమియంలో 10 శాతం తగ్గింపు లభిస్తుంది. అంటే తర్వాతి సంవత్సరం రూ.18 వేలు చెల్లిస్తే చాలు. రూ.20 లక్షల కవరేజీ వస్తుంది. ఇలా తర్వాతి సంవత్సరాలకూ నిబంధనలకు లోబడి 10 శాతం తగ్గింపులు వర్తిస్తాయి.

### చివరగా..

చిన్నచిన్న వాటికే క్లెయిములు చేస్తే ఆరోగ్య బీమా ద్వారా పొందే ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది. జలుబు, దగ్గు, జ్వరాలు, ఇతరత్రా సీజనల్ వ్యాధులకు ఆరోగ్య బీమాలను ఉపయోగించుకోవడం మానేయండి. పెద్ద సమస్యలు ఎదురైతేనే బీమాను వాడుకోండి. అలాగే ఆరోగ్యంగా ఉన్నప్పుడే బీమాలను తీసుకోండి. బీపీ, షుగర్ వంటివి వచ్చాక తీసుకుంటే ప్రయోజనాలకు కోతలు తప్పవు. ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు వాస్తవాలను వెల్లడించండి. ప్రీమియంలను రెగ్యులర్‌గా చెల్లించండి. నిజాలను దాస్తే ఇబ్బందులు తప్పవు. నో-క్లెయిం బోనస్‌లు.. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, ఇండివిడ్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకూ వర్తిస్తాయి.

# రివర్స్ మార్ట్‌గేజ్




## ఈ గృహ రుణం ఎవరికి, ఎలా వస్తుందో తెలుసా!




సంప్రదాయ గృహ రుణానికి భిన్నంగా ఇటీవలికాలంలో రివర్స్ మార్ట్‌గేజ్ లోన్లు స్థిరాస్తి మార్కెట్‌లో పాపులారిటీని సంతరించుకుంటున్నాయి. వృద్ధాప్యంలో ఏ ఆదాయం లేని ఇంటి యజమానులకు నిజంగా ఇవి ఆర్థిక భరోసానే కల్పిస్తున్నాయి. నగదు అవసరాలు లేదా ఇతరత్రా జీవన వ్యయాల కోసం ఉన్న ఇంటిని అమ్ముకొని రోడ్డునపడకుండా ఉన్న ఇంట్లోనే సంతోషంగా ఉంటూ ఆర్థిక భద్రతను పొందేలా ఈ లోన్లు సీనియర్ సిటిజన్లకు కలిసొస్తున్నాయి.

### ఏయే రకాలు? హెూం ఈక్విటీ కన్వర్షన్ మార్ట్‌గేజ్

ఈ హెచ్‌ఈసీఎం పథకం అత్యంత ఆదరణ కలిగినది. రివర్స్ మార్ట్‌గేజ్ వెసులుబాటు విస్తృతంగా అందుబాటులో ఉంటుంది. 62, ఆపై వయసు కలిగినవారి కోసం దీన్ని రూపొందించారు. ఇంటి ఈక్విటీలో కొంత భాగాన్ని నగదులోకి మార్చుకోవచ్చు.

ప్రొప్రైటరీ రివర్స్ మార్ట్‌గేజ్

ఈ సదుపాయాన్ని ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు అందిస్తున్నాయి. అధిక విలువ కలిగిన ఇంటి యజమానుల కోసం దీన్ని డిజైన్ చేశారు. అయితే హెచ్‌ఈసీఎంకు అర్హత లేకపోతేనే దీనికి అర్హులు.

### సింగిల్-పర్పస్ రివర్స్ మార్ట్‌గేజ్

ఓ నిర్ధిష్ట అవసరం కోసం నగదు కావాలనుకునే ఇంటి యజమానులను దృష్టిలో పెట్టుకొని తెచ్చినదే ఈ పథకం. ఇంటి అభివృద్ధికైనా లేదా వైద్య ఖర్చులైనా కావచ్చు. దీన్ని నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్, ప్రభుత్వ ఏజెన్సీలు వాడుకొంటాయి.

ఏయే డాక్యుమెంట్లు అవసరం?

రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ పొందడానికి ఓటర్ ఐడీ, పాన్, ఆధార్, పాస్‌పోర్ట్, ఎంప్లాయీస్ ఐడీ కార్డ్ వంటి ఐడెంటిటీ ప్రూఫ్‌లు అవసరం.

అడ్రస్ ప్రూఫ్‌లుగా ఓటర్ ఐడీ కార్డ్, కరెంట్ బిల్లు, పాస్‌పోర్ట్ వంటివి చూపించవచ్చు.

ఇల్లు మీదే అని చెప్పడానికి టైటిల్ డీడ్, ప్రాపర్టీ ట్యాక్స్ రశీదులు, మీ పేరిట ఉన్న కరెంట్ లేదా గ్యాస్ ఇతరత్రా బిల్లులు కావాలి.

పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరం. కావాల్సిన మరికొన్ని పత్రాలనూ సమర్పించాల్సిందిగా రుణదాతలు కోరవచ్చు.

### ఫీజులు-చార్జీలు

ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ కోసం ఫీజులు, చార్జీలు ఆయా బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలనుబట్టి మారుతూ ఉన్నాయి.

ప్రాసెసింగ్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ చార్జీలు వంటివి ఉంటాయి.

రుణం తీసుకున్నాక నిబంధనలకు విరుద్ధంగా ముందే చెల్లించినా, ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్ లేదా సంస్థలకు మారినా జరిమానాలు పడుతాయి.

హెూం ఇన్సూరెన్స్ పాలసీకి సంబంధించి అన్ని ప్రీమియంల చెల్లింపులు సకాలంలో ఉండాలి.

### గుర్తుంచుకోండి

సాధారణ గృహ రుణాలతో పోల్చితే ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్లపై అధిక వడ్డీరేట్లు పడుతాయి.

మార్కెట్ ట్రెండ్‌కు తగ్గట్టే ఫిక్స్‌డ్ లేదా ఫ్లోటింగ్ రేట్ల విధానాలను రుణగ్రహీతలు ఎంచుకోవచ్చు.

ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 10(43) కింద ఈ రుణం ద్వారా అందుకునే లంప్సమ్ లేదా వాయిదా చెల్లింపుల ఆదాయంపై సీనియర్ సిటిజన్ల (రుణగ్రహీతలు)కు పన్ను మినహాయింపుంటుంది.

ఈ లోన్ తీసుకునేటప్పుడు తెలియకపోతే ఏ డాక్యుమెంట్లపైనా సంతకాలు చేయవద్దు. గుర్తుతెలియని సంస్థలు ఆఫర్ చేసే రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ల వైపు వెళ్లకపోవడమే మంచిది.

మరింత సమాచారం, అవగాహన కోసం బ్యాంకులకు నేరుగా వెళ్లి, అక్కడి ప్రతినిధులను సంప్రదించడం ఉత్తమం.

రుణం కావాలను కునేవారికి ఆన్‌లైన్ దరఖాస్తుతో 4 రోజుల్లోనే అప్రూవల్ ఇస్తున్న దేశంలోని పలు ప్రైవేట్ బ్యాంకులు.

అర్హత ఏంటి?

రుణగ్రహీతకు 60 ఏండ్లు, ఆపైనే ఉండాలి. కో-బారోవర్‌గా భర్త లేదా భార్య ఉంటే వారి వయసూ 55 ఏండ్లు దాటాలి.

ఏ ఇంటి ద్వారా మీరు రివర్స్ మార్ట్‌గేజ్ లోన్‌కు వెళ్లాలనుకుంటున్నారో.. ఆ ఇల్లు మీకు (రుణగ్రహీత) పూర్తిగా సొంతమైనదై ఉండాలి. అలాగే ఆ ఇల్లు మీ ప్రధాన నివాసమై ఉండాలి. అంతేగాక ఇంకా 20 ఏండ్లకుపైగా నివాసయోగ్యమైనదై ఉండాలి.

రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ తీసుకునే ఇంటికి ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉండకూడదు. దానిపై ఏ అప్పులూ ఉండరాదు. ఇంటికి ఏ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు రిపేర్ చేస్తూ చక్కగా కాపాడుకోవాలి.

రుణగ్రహీత ఆదాయం, క్రెడిట్ స్కోర్, అప్పు చెల్లించే సామర్థ్యం ఇలాంటి వేటినీ రుణదాత (బ్యాంక్ లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ)లు పరిశీలించారు. ఇంటి పరిస్థితి, దానికి సంబంధించిన అన్ని అంశాలనే క్షుణ్ణంగా చూస్తారు.

### ఇదీ సంగతి..

రివర్స్ మార్ట్‌గేజ్‌లో ఇంటి విలువలో 80 శాతందాకా రుణంగా లభిస్తుంది.

ఒకేసారి లేదా నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక వాయిదాల్లో ఇంటి యజమాని (రుణగ్రహీత)కి రుణం సొమ్ము అందుతుంది.

రుణం తీసుకున్నాక ఆ ఇంట్లోనే రుణగ్రహీతలు ఉండవచ్చు. ఇంటిని అమ్ముకోవడమో, లేకుంటే ఖాళీ చేయడమో, లేదా రుణగ్రహీత(లు) చనిపోయాకే రుణం, వడ్డీ చెల్లింపులు మొదలవుతాయి. అప్పటిదాకా ఎలాంటి చెల్లింపులుండవు.

తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించాకే రుణగ్రహీత (యజమాని) లేదా వారసులకు ఇంటిపై మళ్లీ హక్కులు వస్తాయి.

రుణం చెల్లించలేని పరిస్థితులు తలెత్తితే రుణం ఇచ్చినవారు ఇంటిని వేలం వేసి బకాయిలను వసూలు చేసుకుంటారు.

# మార్కెట్‌పై బేర్ పట్టు



## మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు పారుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా అడుగులు వేస్తుండటం మదుపరులకు అస్సలు రుచించడం లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం కోల్పోయి 79వేల మార్కుకు దిగువన 78,041.59 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 1,180.80 పాయింట్లు లేదా 4.76 శాతం దిగజారి 24వేల మార్కును చేజార్చుకొని 23,587.50 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికే లోను కావచ్చన్న అంచనాలున్నాయి. ఫలితంగా ప్రధాన రంగాల్లో లాభాల స్వీకరణకు వీలుందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కూడా ప్రధానమే. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,900-24.100 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

### గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.